మల్లడు. పెట్టిన బువ్వల యింత తీస్కవొయి మనవని ఆకలి గూడా తీర్సొచ్చని ఆశవడ్డడు. ఆయన యెన్కమ్మటే పెద్దసారు ఆఫీసుండే యింటి దగ్గర్కి వొయ్యిండు.

మల్లన్ని యింటి లోపలికి తీస్కవోతూ.. ''అమ్మగారూ. వున్నరా. మన కూలీకచ్చినాయనే అన్నం టిపినీ మర్చిపోయోచ్చిండంట. జర గింత బువ్వ వెడ్తరా'' అని బయట్నుంచే అడిగిండు సూపరైజరు.

''యేంది. దారిన వొయ్యేటోళ్లందరినీ పట్టుకస్తన్నవా. నువ్వు శెప్పంగనే ఇస్తారేశి అడ్డించాల్నా యిప్పుడు. యేదో దూరపు సుట్టానివని నౌకర్లకి తీసుకున్నడాయనే. నువ్వేమో రాన్రాను యిసుంట రమ్మంటే, యిళ్లంతా నాదే అంటన్నవ్. సూశీ సూడనట్టు వోతంటే యేర్పడ్త లేదు నీకు. గీడ వుద్యోగం శేయాలనుందా లేదా నీకు'' అని లోపల్నుంచి అర్శిందామే.

''ముసలోడు అమ్మగారు. పాపం గావర్లై, కళ్లు తిరిగి వడ్డడు.'' అన్నడు సూపరైజరు.

మళ్ల యిటు దిక్కేమో.. 'శెప్పులిప్పూ. యీడనే కూసో.' అని మల్లనికి మెల్లగా శేవుల జెప్పిండు.

''మా సార్ భార్య దేవత. శానా మంచిది. ఆ దూరంగా రెండంతరాలిళ్లు కనిపిస్తాంది సూడు. ఆమె గా యింట్లనే బిడ్డలతో కలిసుంటది. యిప్పుడిందులుందీ మా సారు ఉంచుకున్నామె. పొగరువోతు. మనుసుల్నీ లెక్క జేయ్యదు. మన లాంటోళ్లనింక పురుగులెక్క జూస్తది. వొకప్పుడు మీలెక్కనే కూలీ పని జేసేటిదంట. మా సార్ని వల్లెస్కోని, ఆళ్లతోనే ఆమె మొగడ్ని పక్కకు జరిపించి యిడికొచ్చిందంట.'' అని మల్లనికి గొణుక్కుండా జెప్పిండు.

కాసేపటికి ''కూలోడ్ని, కూలోని లెక్కనే వుంచాలి. పాపం అనుకుంట యింట్లకి తీస్కరావొద్దు. ఐనా ముసలోన్ని పనిలకెందుకు తీస్కున్నవ్. మా సొమ్మంత ఆగం జేస్తున్నవ్'' అనుకుంట ఓ యిస్తరాకుల యింత అన్నం, పచ్చడేదో వట్టుకుని బయటికచ్చిందామే.

బగ్గ ఆకలి మీదున్న మల్లడు.. తనకెళ్లోచ్చే యిస్తరాకును గాకుండా ఆ ఆడ గొంతెక్కడ్నో యిన్నట్టనిపించి తలెత్తి జూసిండు. మొకం గూడా యెడ్నో జూసినట్టని పిచ్చి, కళ్లు తూడ్సుకుని మళ్లోపారి జూసిండు. గతమొక్కపారి కండ్లముందు యాదికచ్చి మాయమైనట్టనిపిచ్చింది ముసలోనికి. బతికుందో, సనిపోయిందోననుకుంటున్న కోడలు సుభద్రను.. యెదురుంగ ఆ రీతిల జూసేసరికల్ల కండ్లు తిరిగినట్టనిపిచ్చింది. ''కట్టూ, బొట్టు అన్నీ మార్నయి. మెడల బంగారం, నెత్తిల మల్లెబూలు, వొంటికి శిల్కు శీర కట్టుకుని యేషకాంత లెక్కున్నంత వోలే దాన్నెట్ల మర్శిపోత'' అనుకున్నడు.



**''అయ్యో.. మల్లయ్య మావా కింద పడ్డడుర్లా'' అని తినే సద్దిని పక్కనే శి వురికొచ్చిర్రు కులపోల్లు. మల్లన్ని లేపి, పక్కకు కుసవెట్టే పనిల కొంతమందుంటే, ముసలోడ్ని తోలుకస్తే గిట్లనే వుంటదని సూరీగాడు, నర్సీగాడు అన్నరు. ఆళ్లంతా వొక్కకాడ మూగేసరికల్లా సూపరైజరూ అటొచ్చిండు. ''కూలికచ్చి అందరూ వొక్కకాడ గూడి ముచ్చట వెడ్తున్నార్రా?'' అని గుర్రుగా జూసిండు. పని మజ్జెల బండెల్లిన ఇషయం గమనించిండు. ముసలోని గోస తెల్సుకుని అయ్యో పాపం అనుకుండు.**

''నోరొక్కటే శెడ్డది. వూకే మొగని మీదవడి వొర్లుతదే గానీ మనసు బంగారమనుకుంటి. కానీ బంగారమసొంటి నా యాదిగాన్ని మాయం జేశుంటదా ఇది'' అనుకుంట గుండెల్నుంచి తన్నుకొస్తున్న యేడుపును ఆపుకున్నడు. కోపాన్ని అదిమిపట్టుకున్నడు. మొకాన్ని పక్కకు తిప్పి కూసుండు.

''యిదిగో పెట్టుకోపో. మీ సారు లేనిది జూసి యింకోపారి యిలాంటోళ్లందర్ని యింట్లకి తోల్కరాకు.'' అనుకుంట ఆ అన్నం సూపరైజరుకిచ్చి ఆమె లోపల్కి వొయ్యింది.

సూపరైజరు యిస్తరాకుని మల్లని ముందు వెట్టిండు. 'జెప్పిన గదనే గామె యెట్లాంటిదో. యెన్ని మాటలన్న నేను వట్టించుకోను. నువ్వు గూడ సప్పుడు జేయకుండ దబ్బున తిని యింటికి వో. రేపొచ్చి పనిల జేరు. నేను వోతన్న. గక్కడ పనెట్ల జేస్తున్నరో' అనుకుంట యెల్లివొయ్యిండు.

ముసలోడు పచ్చడి మెతుకుల్నైతే కలిపిండు గానీ, ముద్ద నోట్లోకి వెట్టలేదు. యింకో దిక్కు మన్వని ఆకలి గూడా మతికి రాలేదు ఆ గడియల. శేతికంటిన ఆ యెర్రటి మెతుకులు జూస్తే కొడుకు రక్తపు కూడులెక్క అన్పిచ్చినయి. బలవంతంగా యిస్తర్లోకి వదిలించుకున్నడు. 'అమ్మా బుక్కెడన్ని నీళ్లిత్తవా' అని గట్టిగా పిల్శిండు.

''ఏయ్. నీకు బువ్వ వెట్టుడే యెక్కువ. యింక నీళ్లు గూడా నేనే యియ్యాల్నా'' అన్నదామే.

మళ్లీ.. 'అమ్మా..' అని యింకింత గట్టిగనే వొర్లిండు మల్లడు.

''ఛీ ఛీ. అడ్డమైనొళ్లందర్నీ లోపలికి రానిత్తే యిట్టనే వుంటది.'' అనుకుంట కొంతసేపట్కి నీళ్లు తెచ్చి మల్లని ముందు వెట్టింది సుభద్ర.

కళ్ల నుంచి దుంకుతున్న కన్నీళ్లను ఆగవట్టుకుంట పైకి లేసిండు మల్లడు. మావని జూసిన సుభద్ర ఒక్కపారిగా యెనక్కి జరిగింది. భయంతో యెనకాలున్న గోడకతుక్కని కదలకుండా నిలవడ్డది.

కోడల్ని సంపేటంత కోపంతో పళ్లు కొరుక్కుంటా.. వో సూపు జూసిండు మల్లడు. తెచ్చిన నీళ్లను శేత గుంజుకుండు. యిసొంటి తిండి తింటే యెంత, తినకవోతే యెంత అనుకుంట దబ్బదబ్బ శేతులు కడుక్కున్నడు. ''థూ. దీనవ్వ. పాడు ఆకలి.'' అనుకుంట అక్కడ్నుంచి బైటకచ్చి, గుడిసెల దిక్కు నడ్శిండు.

అప్పటిదంకా బొమ్మలెక్క కళ్లు కిందకేశిన సుభద్ర, మల్లడు అటు తిరగంగనే యేగిరంగా యింట్లకుర్కి తలుపులేస్కుంది.

* * *

గుడిసెకు ఎదురుంగొస్తున్న మల్లన్ని జూసింది ఎల్లవ్వ. గప్పుడే అత్తాన్నావ్ ఎందయ్యా అనుకుంటనే 'పోరనికి జరమగ్గింది' అని సంబురంగా జెప్పింది.

'రాజుగాని ఆకలి జూసి.. జరానికి కూడా భయమైనట్టున్నదే ఎల్లి. ఆని అమ్మ నాయనల లెక్కనే గది గూడా ఆడ్ని దబ్బున్నే యిడ్సవెట్టి వొయ్యిందిలే. ఐనా జరానికి మించిన జెట్ట రోగాలున్నయ్ గొన్ని. గయి మనకు లేనందుకే యింకెక్కువ సంబురవడాలే' అనుకుంట దబ్బదబ్బ గుడిసెలోకి వొయ్యిండు. బాసాన్లని, బట్టల్ని బస్తాల సర్దిండు. గుడిసేపైన పట్టాల్ని అట్లే అదిలేసిండు.

మనవన్ని భుజానేసుకున్నడు. బస్తా శేతవట్టిండు. యేమైందయ్యా అనడిగిన ఎల్లవ్వకు ''యీ వూళ్లే మనకు పని దొరకదే. పోరడ్ని బతికించుకొని సాదుకోవాల్నంటే మనం యిడ్నుంచి బోవాలే'' అని జెప్పి బయటకి తీస్కచ్చిండు. అట్లా ఆల్లంతా కొంత దూరం నడ్శి, పక్కనే వున్న పెద్ద రోడ్డెక్కిర్రు. ఎదురుంగొచ్చిన బండేదో యెక్కిర్రు.

* * *

అటుదిక్కు సూపరైజరును యింట్లకి పిల్శింది సుభద్ర. రేపటిసంది యీ గుంపునంతా పనులకు రానియ్యొద్దని జెప్పింది. యేరే గుంపుతో పని వొడ్పియ్యాలన్నది. యెందుకు, యేంది అనడిగితే.. 'నన్ను నువ్వు శెర్సాడానికి జూసినవని మీ సారుకు జెప్తా' అని ఆన్ని బెదిరిచ్చింది.

నౌకరి వొతే బతుకుదెరువు కష్టమనుకున్న సూపరైజరు.. పొద్దుగూకగముందే కూలోల్ల దగ్గర్కివొయ్యిండు. యేమీ జెప్పకుండా రేపటిసంది పనుండదని జెప్పి, రెండు పొంటెల కూలిచ్చి ఆళ్లని యెల్లగొట్టిండు. యేమైందో సమజ్గాని మల్లని కులపోల్లు.. గుడిసెల కాడికచ్చి ఆళ్లక్కడ లేనిది జూసి ఆగమైర్రు. ■

## క్రాంతి శివరాత్రి



ఈ కథ రాసిన రచయిత క్రాంతి శివరాత్రిది సూర్యాపేట జిల్లా తిరుమలగిరి. సివిల్ ఇంజినీరింగ్ చదివి, ఉస్మానియా యూనివర్సిటీలో మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పీజీ చేశారు. మూడేండ్ల పాటు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో ఉండగా మొదటి కథ రాశారు. 2019లో పూర్తిస్థాయి కథలు రాయడం మొదలుపెట్టారు. ఇలా రాసిన మొదటి కథ ఓ ప్రముఖ దినపత్రికలో అచ్చయింది. ఈ అయిదేండ్లలో ఎనిమిది కథలు రాశారు. అవన్నీ వివిధ దిన పత్రికల్లోని అదివారం అనుబంధాల్లో ప్రచురితమయ్యాయి. కొన్ని నవలలకు ఎడిటర్‌గా కూడా సేవలు అందిస్తున్నారు క్రాంతి శివరాత్రి. 2020 సంవత్సరంలో 'వెలితి' అనే కథకు 'భానుపురి సాహితీ వేదిక' వారి నుంచి జాతీయ పురస్కారం అందుకున్నారు. చుట్టూ జరిగేవాటిని, చూసిన వాటిని, విన్న వాటిని కథావస్తువులుగా ఎంచుకుంటానంటారు రచయిత. ''జెట్టరోగం' మా అమ్మ చెప్పిన కథ. ఇది రాసేటప్పుడు, పోటీకి పంపేటప్పుడు అమ్మ నా పక్కనే ఉంది. ఫలితాలు వచ్చేసమయానికి బ్రెయిన్ స్ట్రోక్‌తో అమ్మ నాకు దూరమైంది' అని తన ఆవేదనను వెలిబుచ్చారు.